## క్లుప్తంగా

### రేపు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్ల నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. నరాల సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### ప్రారంభమైన శ్రీగంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని స్థానిక న్యాక్ బిల్డింగ్ సమీపంలోని వైఎస్ చిన్నకొండారెడ్డి రజక కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీగంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో గణపతి, గోపూజ, యాగశాల ప్రవేశం, స్వస్తివాచనం, పంచగవ్యం తదితర పూజాది కార్యక్రమాలతోపాటు సాయంత్రం శ్రీదేవి లలితా పారాయణం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, తదితర హోమాలు నిర్వహించారు. ఆలయంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టతోపాటు ధ్వజ శిఖర, కలశ, శ్రీపోతులయ్య ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### పండ్ల తోటలపై అవగాహన

**సింహాద్రిపురం :** మండలంలోని లోమడ గ్రామంలో ఏఓ శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోట పెంపకాలలో భాగంగా 25 రకాలలో మీకు అనువైన రకం ఎంచుకుని పండ్ల తోటలను సాగు చేసుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకానికి రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్, ఉద్యాన శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### రక్తహీనత నివారణపై అవగాహన

**సింహాద్రిపురం :** మండలంలోని అంకాలమ్మ గూడూరు, అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం కిశోర వికాసం శిక్షణ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత కౌమార దశలో రక్తహీనత బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అలాగే మొబైల్ చూడకూడదని, మొబైల్ చూస్తే కలిగే నష్టాల గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. బయట విక్రయించే ఆహారం తీసుకోకూడదని, ఇంట్లో అమ్మ చేసే మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

### హెచ్ఐవీ నిర్ధారణకు 1097కు డయల్ చేయండి

**కమలాపురం :** హెచ్ఐవీ వ్యాధి పట్ల అనుమానం ఉంటే 1097కు డయల్ చేయాలని, ఈ నెంబర్ అన్ని భాషల్లో 24 గంటలు పనిచేస్తుందని కె. జయశంకర్ కళా బృందం తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో కళాజాత బృందం పాటలు, నాటికలు, ఇంద్రజాల, మహేంద్ర జాలంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు మార్గాల ద్వారానే సోకుతుందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత రక్తాలు, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు సురక్షితం కానటువంటి బ్లేడ్లు, సిరంజీల ద్వారా సోకే అవకాశం ఉందన్నారు. భారత ప్రభుత్వం హెచ్ఐవీ బాధితులను రక్షించేందుకు చట్టం -2017 ప్రవేశ పెట్టిందన్నారు.

### నేడు పంచాయతీ వేలంపాట

**ముద్దనూరు :** ముద్దనూరు మేజర్ గ్రామపంచాయతీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి బస్టాండు, జంతువధశాలకు శనివారం వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో నరసింహులు తెలిపారు. బస్టాండు వేలంపాటకు రూ.4 లక్షలు, జంతువధశాలకు రూ.40 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# పులివెందులలో ఈ-స్టాంపుల కొరత

- రెట్టింపు ధరలు వసూలు చేస్తున్న వెండర్లు
- రిజిస్ట్రేషన్లకు తప్పని తిప్పలు

**పులివెందుల రూరల్ :** పులివెందుల ప్రాంతంలో ఈ-స్టాంపుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా విక్రయదారులకు నెలలు గడుస్తున్నా స్టాంపు పేపర్ల సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆస్తుల కొనుగోలు, విక్రయాలు చేసేవారికి తిప్పలు తప్పడం లేదు. కొన్ని నెలలుగా స్టాంపులు సమస్య ఉన్నా అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్టాంపుల కొరతను సాకుగా చూపి వెండర్లు ధరలు రెట్టింపు చేస్తున్నారు. కొంతమంది రూ.50ల స్టాంపులు రూ.100లకు, రూ.100ల స్టాంపులు రూ.150లకు విక్రయిస్తున్నారు. దీంతో చేసేదేమీలేక స్టాంపులను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని క్రయ విక్రయదారాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల ప్రాంతంలో స్థిర స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ఒప్పందాలు, ధృవీకరణాల న్యాయపరమైన లావాదేవీలకు ఈ స్టాంపులను ఉపయోగిస్తారు. రూ.10, రూ.20, రూ.100ల స్టాంపు పేపర్ల కొరత ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-స్టాంపుల కొరత ఉండటంతో రిజిస్ట్రేషన్లకు తిప్పలు తప్పడం లేదు.



పులివెందులలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

**రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపులు లేక**

ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తుంది. స్టాంపుల కొరతతో ఒకట్రెండు పేపర్లతోపాటు తెల్ల బాండ్ పేపర్లు వాడి రిజిస్ట్రేషన్లు ముగించుకుంటున్నారు. నెలలు గడుస్తున్న స్టాంపు పేపర్ల కొరత సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆస్తులు కొనుగోలు, విక్రయాలు చేసే వారికి ఇబ్బందికరంగా మారింది. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**అధిక ధరలకు విక్రయిస్తున్నారు**

కొందరు స్టాంపు వెండర్ల వద్ద పాత స్టాకు ఉన్నప్పటికీ డిమాండుతో సొమ్ము చేసుకుంటున్నారు. రూ. 500ల స్టాంపును రూ.100లకు, రూ.100ల స్టాంపును రూ.150ల నుంచి రూ.200లకు విక్రయాలు జరుపుతూ అత్యవసర పరిస్థితుల్లో ధర ఎక్కువైన పరిస్థితులను బట్టి కొనుగోలు చేసుకుంటున్నారు. డిమాండ్‌కు తగిన విధంగా స్టాంపులు లభించని పరిస్థితి నెలకొంది. పులివెందుల పట్టణంలోని శ్రీనివాస హాలుకు వెళ్లే దారిలో ఒక బుక్ స్టోర్ రూ.50, రూ.100ల స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. కానీ ఆయన చెప్పిందే ఆటగా పాడిందే పాటగా అందరిని బెదిరిస్తూ అధిక ధరలుకు స్టాంపులు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్టాంపుల కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**స్టాంపుల కొరత ఉంది**



పులివెందుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరత ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్టాంపులు వచ్చిన వెంటనే అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూస్తాం. అలాగే అధిక రేట్లకు ఇ-స్టాంపులను అమ్ముతున్న వెండర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖరరావు, సబ్ రిజిస్ట్రార్, పులివెందుల

# వేంపల్లెలో రైతు బజార్‌ను తెరిపించండి

**వేంపల్లె :** ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లె పట్టణంలో ఉన్న రైతు బజార్‌ను తెరిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం గండిక్షేత్రానికి విచ్చేసిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను బీజేపీ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని రైతులు పండించిన పంటలను నేరుగా రైతు బజార్లో విక్రయించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో ప్రైవేటు స్థలంలో ఉన్న మార్కెట్‌ను తీసివేసి రైతు బజార్‌కు తరలించాలని జిల్లా సంయుక్త అధికారి అధితిసింగ్ ఇచ్చిన ఆదేశాలను అమలు పరచాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే రైతు బజార్‌ను తెరిపించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

# ఉద్యాన పంటలను సాగు చేయండి

**లింగాల :** మండలంలో విస్తారంగా ఉద్యాన పంటలను సాగు చేయాలని వ్యవసాయ, ఉపాధి హామీ అధికారులు శుక్రవారం గ్రామసభలు నిర్వహించి రైతులకు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఉద్యాన పంటలను సాగు చేయాలని సూచించారు. చీనీ, నిమ్మ, జామ తదితర ఉద్యాన పంటలకు ఉచితంగా మొక్కలను అందించడమే కాకుండా మొక్కలను నాటుకునేందుకు గుంతలు తీయడం, అంతర వ్యవసాయానికి నీరు పెట్టడానికి, కలుపు నివారణకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు అందిస్తారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉద్యాన, వ్యవసాయ, ఉపాధి, పంచాయతీ అధికారులు గ్రామసభలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఏఓ రమేష్, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ లోకేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

# కుప్పాలపల్లెలో భాగవత సప్తాహ పఠనం


భగవద్గీత పారాయణం చేస్తున్న భాగవత భక్త సమాజ మండలి సభ్యులు

**వేంపల్లె :** కుప్పాలపల్లెలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో భగవత భక్త సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం భాగవత సప్తాహ పఠనం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మడూరు గ్రామానికి చెందిన వెంకట శేషయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా భగవత భక్త సమాజం అధ్యక్షుడు చిన్న శివారెడ్డి, ఉపాధ్యక్షుడు పాపిరెడ్డిలు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు భారీగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఈ భగవత సప్తాహ పఠనం నిర్వహిస్తున్నామని, అలాగే ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు భగవద్గీత పారాయణం ఉంటుందని, ప్రతి రోజూ రాత్రి ఉపన్యాసాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 6 రోజుల పాటు ఉంటుందని, 22న హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి ఊరేగింపుతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

# పంటలసాగు కోసం కాల్వల పనులు చేపట్టాలి

**కొండాపురం :** గండికోట జలాశయం నుంచి వామికొండ సర్వారాయసాగర్ రిజర్వాయర్‌కు నీళ్లు నింపడం వల్ల ఎటువంటి ఉపయోగంలేదని రైతులు పంటలు సాగు చేసుకునేలా కాల్వల పనులు చేపట్టాలని సీపీఐ కార్యవర్గ సభ్యులు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డిలు డిమాండ్ చేశారు. శుక్రవారం గండికోట జలాశయంను ప్రజా సంఘాల ప్రతినిధి బృందం సందర్శించి మాట్లాడారు. గతంలో ప్రారంభించిన పిల్ల కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. గండికోట జలాశయం కింద కోల్పోయిన మొదటి విడత 14 గ్రామాలకు ఇవ్వాల్సిన రూ.3.25 లక్షలు పరిహారంతో పాటు ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో భాగంగా అదనంగా రూ.2 లక్షలు కలపి రూ.5.25 లక్షలు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. దీనితోపాటు ఈ రిజర్వాయర్లకు ప్రధాన కాల్వల నిర్మాణ పనులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. కాల్వ పనులు చేపట్టేలా నిధులు కేటాయించాలన్నారు. రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో పంటలు సాగుచేసుకునేలా పనులు తక్షణమే చేపట్టాలన్నారు. కౌలు రైతు సంఘం అధ్యక్షుడు టి.రామంజినేయులు, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఎఐటీయూసీ మండల కార్యదర్శి పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


గండికోట జలాశయంను సందర్శించిన ప్రజాసంఘాల నాయకులు

# డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


తొండూరులో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజా మొహిద్దీన్


వేంపల్లెలో డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది


చింతకొమ్మదిన్నెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

**తొండూరు :** డెంగీ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బోడివారిపల్లెలో డాక్టర్ అరిపుల్లా ఆధ్వర్యంలో 104 వైద్య సేవల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ ప్రజలతో కలిసి నిర్వహించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మూడు పద్ధతులను పాటించి డెంగీను ఓడించవచ్చునన్నారు. డ్రై డే పాటించడం ద్వారా, నీటి పాత్రలపై మూతలు ఉంచడం ద్వారా డెంగీ వ్యాధిని నివారించవచ్చునన్నారు. అ లాగే మండలంలోని మల్లేల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాస కార్యక్రమంలో భా గంగా బాలికలకు రక్తహీనత నివారణపై అవగాహ న సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య రక్తహీనతకు గల కారణాలు, లక్షణాలు, నివారణా మార్గాలు, తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి, వ్యాధి తీవ్రత గురించి, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, వైద్య, ఆరోగ్య సిబ్బంది నరేష్, విజయ, శశికళ, మహిళా పోలీసు శ్రావణి, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వేంపల్లెలో**

**వేంపల్లె :** డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజల సహకారంతో డెంగీ వ్యాధి నివారణ సాధ్యమని తాళ్లపల్లె పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీప్రియ తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు డెంగీ వ్యాధి నివారణకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి రాకుండా, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలన్నారు. రానున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. నీటి కుంటల్లో గాంబుజీయా చేపలు వేయించుకోవాలని, ఆకస్మిక జ్వరం విపరీతమైన కండరాలు, కీళ్ల, కళ్ల నొప్పులు, వాంతులు డెంగీ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరిసరాల పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నిషా, సీహెచ్ఓ వెంకటరత్నం పాల్గొన్నారు.

**చింతకొమ్మదిన్నెలో..**

**చింతకొమ్మదిన్నె :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత ఆధ్వర్యంలో చిన్న జాగ్రత్త – పెద్ద రక్ష అనే అంశంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో దోమలు పెరిగే నీటి నిల్వలను తొలగించాలని అలాగే ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. తొట్టెలు డబ్బాలు లాంటివన్నీ మూతలు మూసి ఉంచాలన్నారు. దోమకాటు నుంచి రక్షణకు దోమతెరలు వాడాలన్నారు. అనంతరం డెంగీ నియంత్రణలో నావంతు పాత్ర పోషిస్తానని ప్రజలతో వారు ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ అనంతరం సచివాలయం పరిధిలో జరుగుతున్న దోమల సంహారక మందు పిచికారీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, సమాజ ఆరోగ్య అధికారి సుకుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళీధర్, ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముద్దనూరులో..**

**ముద్దనూరు :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నాగార్జున జాతీయ డెంగీ నివారణ దినోత్సవ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే సందర్భంగా ప్రజలకు వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించి, ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులరెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### నవ ధాన్యాలు సాగు చేయాలి

**కమలాపురం :** రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా నవ ధాన్యాలు సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం మండల యూనిట్ ఇన్‌చార్జ్ లతా కుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని కోగటం గ్రామంలో వీఓ-3లో ఖరీఫ్ కార్యచర ణ ప్రణాళిక-2025-26 నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ రైతులుగా ఎంపికైన శి వారెడ్డి, జ్యోతి, అరుణ తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 92 కిచెన్ గార్డులు, 4 ఏటీఎం మోడల్స్ ఉన్నాయన్నారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో కనీసం 100 ఏకరాల్లో నైనా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. భూమిని 365 రోజులు గ్రీన్ కవర్ చేస్తే భూమిలో కర్బన శాతం పెరిగి ప్రధాన పంట దిగుబడి రావడానికి దోహదం చేస్తుందన్నారు.

### దరఖాస్తు చేసుకోండి

**కమలాపురం :** మండలంలోని చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి, ఏపీఓ పార్థసారథి తెలిపారు. శుక్రవారం పొడదుర్తి, లేటపల్లె గ్రామాల్లో సభలు నిర్వహించి పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులు మామిడి, చీనీ, నిమ్మ, సపోట, జామ, సీతాఫలం తదితర పంటలు సాగు చేసుకుంటే 3 ఏళ్ల పాటు సంరక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం, మొక్కలు, సంరక్షణ అన్ని మూడేళ్ల పాటు ఉచితం చేస్తామన్నారు. మరో రెండేళ్లు రైతులు ఆ పంటలను సంరక్షించుకుంటే పంట దిగుబడి వస్తుందని వివరించారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.

**శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి**

అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవిలో భాగంగా అందించే కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. పొడదుర్తి, లేటపల్లె గ్రామాల్లో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరై కిశోరి బాలికలకు, తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.

### ఘనంగా ప్రారంభమైన సుంకులమ్మ తిరునాల

**కమలాపురం :** పట్టణంలోని పడమట వీధి సమీపంలో చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మతల్లి దశమ తిరునాల మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితుల ఆచారత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ మహాగణపతి పూజ, స్వస్తి వాచణము, పంచగవ్య ప్రాసన, ప్రోక్షణ, ఋుత్విక్ కరణము, కంకణ ధారణ, ప్రధాన కలశ స్థాపన, సుంకులమ్మ దేవత పంచామృత అభిషేకములు, అమ్మవారి మూలవరులకు కుంకుమార్చన, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కాగా సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

# నారాపురయ్య కట్టిన ఆలయమే ‘వెంకటేశ్వరాలయం’

**జమ్మలమడుగు :** జమ్మలమడుగుకు ప్రత్యేక చరిత్ర ఉంది. పట్టణానికి పడమర వైపు పెన్నానది ప్రవహిస్తుంది. ఈ పెన్నానది పరివాహక ప్రాంతంలో ఎక్కువగా గుంతల్లో నీరు నిల్వ ఉండి అందులో జంబుతో నిండి ఉంటుంది. దీంతో జమ్మలమడుగును మొదట జంబులమడుగుగా పిలిచేవారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు జమ్మడకగా, తర్వాత జమ్మలమడుగుగా ప్రసిద్ధి చేందింది. పెన్నానది తీరాన ఉత్తర వైపు ఉన్న ఇసుక దిన్నెల్లో వేంకటేశ్వరస్వామి శిలా విగ్రహం పూడిపోయి ఉంది. దీంతో గ్రామానికి చెందిన వెంకటేశ్వరస్వామి భక్తుడైన నారాపురయ్యకు కలలో కనిపించి తాను పడమర వైపు ఉన్న పెన్నానది ఉత్తర వైపు ఉన్న ఇసకదిన్నెల్లో ఉన్నానని తనకు జీర్ణోద్ధరణ చేయాలంటూ కలలో కనిపించి చెప్పాడు. మరునటి రోజు నారాపురయ్య పెన్నానది ఉత్తరం వైపు ఉన్న ఇసుక దిన్నెల్లో ఉన్న ప్రాంతాల్లో వెళ్లి ఇసుకలో ఇరుక్కుపోయిన వెంకటేశ్వరస్వామి శిలా విగ్రహాన్ని బయటికి తీసి జీర్ణోద్ధరణ గావించాడు. అందువల్ల ఈ ఆలయానికి నారాపురవెంకటేశ్వర స్వామి ఆలయంగా గుర్తింపు వచ్చింది. ఈ ఆలయాన్ని 1919 కొంత మంది భక్తులు జీర్ణోద్ధరణ చేసినట్లు ఆలయంలోపల ఉన్న శిలాశాసనాల ద్వారా తెలుస్తుంది. ప్రతి ఏడాది వైశాఖ మాసంలో నారాపురస్వామి తిరునాల జరుగుతూ వస్తుంది. 2008లో నారాపురస్వామి ఆలయాన్ని నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి టీటీడీలో కలిపారు. అప్పటి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వారు పూజ కార్యక్రమాలను నిర్వహిస్తు వచ్చారు.


రథంలో నారాపుర వెంకటేశ్వరస్వామి